
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
3★★
సోమవారం 2 జూన్ 2025



మున్సిపాలిటీల్లో 'మాన్‌సూన్'



- వానాకాలం సమస్యలను అధిగమించేందుకు 100 రోజుల ప్రణాళిక
- నేటి నుంచి సెప్టెంబరు 10 వరకు యాక్షన్‌ప్లాన్ అమలు
- ప్రజారోగ్యం, పారిశుధ్యంపై మున్సిపల్ శాఖ ప్రత్యేక దృష్టి

జగిత్యాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో ఎదురయ్యే సమ స్యలను దృష్టిలో పెట్టుకొని మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభుత్వం మాన్‌సూన్ పేరిట వంద రోజుల ప్రణాళికను రూపొందించింది. ఈనెల 2వతేదీ నుంచి సెప్టెంబరు 10వ తేదీ వరకు అన్ని మున్సిపాలిటీల్లో మురుగు కాలువలు, నాలాలు, ఓపెన్, భూగర్భ డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టనున్నారు. ముఖ్యంగా ముంపు ప్రాంతాల్లో డ్రైనేజీలు శుభ్రం చేయడంతో పాటు పాడైపోయిన మ్యాన్ హోళ్లను గుర్తించి మరమ్మతులు చేపట్టనున్నారు. మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా ఆయా కార్యక్రమాలు చేపడుతూ సమస్యలు పరిష్క రించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. జిల్లాలోని జగి త్యా ల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో వంద రోజు ల ప్రణాళికను అమలు చేయడానికి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

● ప్రజలకు ముందస్తు అవగాహన

వంద రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుధ్య నిర్వహణతో పాటు ప్రజారోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. బస్తీలు, కాలనీలు, రహదారులు, ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లో ప్రతీరోజు బ్లీచింగ్ చేయ డం, ఫాగింగ్ చేయడం, చెరువుల్లో దోమలు వృద్ధి చెందకుండా యాం టీ లార్వా ద్రావణాన్ని స్ప్రే చేయనున్నారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రతపై ప్రజ లకు ముందుస్తుగా అవగాహన కల్పించనున్నారు.

● ఉమెన్ అమృత్‌మిత్ర 2.0...

మున్సిపాలిటీలలో వనమహోత్సవానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేయనున్నారు. ఈ మేరకు ఉమెన్ అమృత్‌మిత్ర 2.0 కార్యక్ర మంలో ఆయా మున్సిపాలిటీల్లో ప్రత్యేక ప్రదేశాన్ని గుర్తించి ఉమెన్ ఫర్ ట్రీ పేరిట మహిళలతో మొక్కలు నాటించి సంరక్షించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో పాటు మున్సిపాలిటీ ల్లోని అన్ని పార్కులు, ఇళ్ల వద్ద, చెరువు కట్టలు, వాకింగ్ ట్రాక్‌లు, శ్మశాన వాటికలు, క్రీడా ప్రాంగణాలు, ప్రభుత్వ భవనాల వద్ద ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టనున్నారు.

● అన్ని వర్గాల భాగస్వామ్యం..

మాన్‌సూన్ 100 రోజుల ప్రణాళికలో అర్బన్ లోకల్ బాడీస్ సిబ్బం ది, ప్రజా ప్రతినిధులు, సెల్ఫ్ హెల్ప్

- మిగతా 6లో

రోళ్ళవాగు ప్రాజెక్ట్ నుంచి సాగు నీరందిస్తాం

-మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



ప్రాజెక్టును పరిశీలిస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

బీర్‌పూర్/సారంగాపూర్, జూన్1 (ఆంధ్రజ్యోతి): రోళ్ళవాగు ప్రాజెక్టుకు షటర్లు బిగించి వానాకాలం నీరందించి రైతులను ఆదుకుంటామని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. రైతులు, అధికారులతో కలిసి రోళ్లవాగు ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం బీర్‌పూర్, సారంగాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2015-2016లో రూ.60 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్ట్ వ్యయం రూ.152 కోట్లకు చేరిందని అయినా అటవీశాఖ అనుమతులు సాధించలేక పోయారని అన్నారు. ప్రాజెక్ట్ జాప్యంపై తాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళడంతో అదనంగా రూ.20 కోట్లు కేటాయించారని అన్నారు. అటవీశాఖ అనుమతుల కోసం కలెక్టర్ అందించిన నివేదిక చీఫ్ కన్జర్వేటర్ వద్దకు వెళ్ళిందన్నారు. అనుమతులు వచ్చే వరకు మరో ఆరు నెలల సమయం పడుతుందని పేర్కొన్నారు. 1టీఎంసీ నీరు నిలువ సామర్థ్యం ఉంటే ముంపునకు గురువుతాయని, 0.25 నీటి నిలువకు అటవీ భూముల ముంపు సమస్య ఉండదన్నారు. ఇందుకు ప్రాజెక్టుకు మూడు షటర్లు బిగింపునకు అధికారులు పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, చేర్పూరి సుభాష్, గుడిసే జితేందర్ యాదవ్, నవీన్‌రావు, ఆకుల రాజిరెడ్డి, కొక్కు గంగారాం, కాలగిరి సత్యనారాయణరెడ్డి, గడ్డం తిరుపతి రెడ్డి, కాలువ భూమయ్య యాదవ్, నాయకులు జితేంధర్ యాదవ్, ముక్క శంకర్, ఆడెపు తిరుపతి, జోగి రెడ్డి, శేఖర్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు

జగిత్యాలరూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ మండలంలోని భూభారతి రెవెన్యూ సదస్సులను మంగళ వారం నుంచి 10వ తేదీ వరకు టీమ్‌ల వారీగా నిర్వహిం చేందుకు ప్రణాళికలు రూపొందించామని జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రాంమోహన్ తెలిపారు. టీమ్-1లో భాగంగా 3, 4, 5 తేదీల్లో తిప్పన్నపేట గ్రామపంచాయితీ పరిధిలోని గ్రామాలకు భూభారతి గ్రామసభలు నిర్వహి స్తామన్నారు. 6, 9, 10 తేదీల్లో జగిత్యాల పట్టణప్రాంతంలో గ్రామసభలు ఏర్పాటు చేశామన్నారు. టీమ్-2 లో భాగంగా 3, 4, 5 తేదీల్లో మోతె గ్రామపంచాయితీపరిధిలోని గ్రామాలకు , 6, 9, 10 తేదీల్లో ధరూర్ గ్రామపంచాయితీలో గ్రామసభలు ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

●కథలాపూర్: మండలంలో భూభారతి గ్రామసభలు ఈ నెల 3 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ వినోద్ తెలిపారు. ఈనెల 3న ఊట్‌పల్లి, పెగ్గెర్ల, 4న దుంపెట, పోసానిపేట, 5న బొమ్మెన, దూలూరు, 6న పోతారం, ఇప్పపల్లి, 9, 10న గంభీర్‌పూర్, తాండ్ర్యాల, 11న కలికోట, తుర్తి, 12,13న సిరికొండ, అంబారిపేట, 16,17న తక్కళ్ళపల్లి, కథలాపూర్, 18,19న భూషణరావుపేట, చింతకుంట గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు భూ సమస్యలకు సంబంధించి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

●మల్లాపూర్: మల్లాపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం నుంచి 10వ తేదీ వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. రెండు బృందాలచే ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

జాగృతి పేరుతో ఎమ్మెల్సీ కవిత కొత్త డ్రామా

● సోనియాగాంధీ కుటుంబాన్ని విమర్శించే స్థాయి ఆమెకు లేదు ● ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్, కేటీఆర్ అరెస్ట్ అయి జైలుకు వెళితే సీటులో కూర్చొనేందుకు ఎమ్మె ల్సీ కవిత జాగృతి పేరుతో కొత్త డ్రా మాకు తెరలేపిందని ప్రభుత్వవిప్, ధర్మ పురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కు మార్ విమర్శించారు. ధర్మపురి ఎమ్మెల్యే క్యాం పు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోనియాగాంధీ కుటుంబాన్ని విమర్శిం చేస్థాయి కవితకు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రికిరాత్రే జాగృతి పేరుతో కార్యాలయం పెట్టాల్సిన అవసరం ఏమి టని ఆయన కవితను ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చిన సోనియా, రాహుల్‌గాంధీ గురించి మా ట్లాడేస్థాయి నీది కాదని ఆయన అన్నారు. సోని యాగాంధీ దయవల్లే కేసీఆర్ సీఎం అయ్యాడని మర్చిపోరా దన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎంగా కేసీఆర్ ధర్మపురి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. సీఎం హోదాలో ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి పుణ్య క్షేత్రానికి వచ్చి యజ్ఞాలు, హోమాలు చేసి ఆలయ అభి వద్ధికి రూ.500 కోట్లు ఇస్తామని చెప్పి కనీసం ఐదు రూపాయలు కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని గురుకులాలు, కస్తూర్బా గాంధీ పాఠశాలలను ఏనాడూ పట్టించు కోలేదని ఆయ న పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే విద్యార్థులకు డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలను పెంచామని విప్ తెలిపారు. ధర్మపురి నియోజకవర్గానికి సుమారు వంద కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటె డ్ హాస్టల్స్ మంజూరు చేయిం చామని అన్నారు. గత ప్రభు త్వ హయాంలో కొప్పుల ఈశ్వ ర్ ఏ సాంఘిక సంక్షేమ శాఖ కు మంత్రిగా వ్యవహరించారో ఆ శాఖలో చాలా అవకతవక లు జరిగాయని ఆయన ఆరో పించారు. త్వరలో జర్నలి స్టులకు ఇళ్ల స్థలాలు మంజూ రు చేసి ఇళ్లు కట్టించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయ న తెలిపారు. అపంతనం రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన రిపోర్టర్ బాబు కుమార్‌కు తెలంగాణ మీడియా అకాడమీ వెల్ఫేర్ స్కీమ్ కింద మంజూరు చేసిన రూ.లక్ష చెక్కును ప్రభుత్వవిప్ అందించారు. ఈ సమా వేశంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మం డల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల ఉపా ధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షులు కుంట సుధాకర్, పట్టణ కాంగ్రెస్‌అధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు.

అన్నదాతపై విత్తన భారం

- జీలుగ విత్తనాల ధర పెంపుతో ఆందోళన
- గతం కంటే రెట్టింపు ధరకుకు విక్రయం
- రూ.1,116 నుంచి రూ.2,140లకు పెంపు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్నరైతులు



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ గోపిక

వెల్గటూర్, జూన్1 (ఆంధ్రజ్యోతి): ఏటా పెరుగుతున్న విత్తనాల ధరలతో అన్నదాతపై అదనపు భారం పడుతోంది. భూసారం పెరగ డానికి రైతులు ఎక్కువగా జీలుగను సాగుచేసి పొలంలో కలియ దున్నుతారు. కానీ జీలుగ విత్తనాల ధర పెరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో 30 కిలోల జీలుగ విత్తనాల సంచికి రూ.2,232 చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వ రాయి తీపోగా రూ.1,116కు లభించేది. కానీ ప్రస్తుతం ప్రభుత్వం 30కిలోల సంచికి ధర రూ.4,275 పెంచింది. ప్రస్తుతం 50శాతం రాయితీపోను రూ.2,140లకు అమ్ముతున్నారు. జీలుగ విత్త నాల సేకరణలో ఇబ్బందులు కలుగడంతో ఎక్కువ ధరకు కొనుగోలు చేయా ల్సి వస్తోందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చెబు తోంది. ప్రభుత్వం స్పందించి ధర పెంపు విష యాన్ని పునరాలోచన చేయాలని రైతులు కోరుతున్నారు.

● సొసైటీల ద్వారా పంపిణీ

జీలుగ విత్తనాలను రైతులకు సొసైటీల ద్వారా పంపిణీ చేస్తున్నారు. రైతులు ముందుగా పట్టాదారు పుస్తకాన్ని వ్యవసాయ అధికారులకు చూపిస్తే ఒక పర్మిట్ నంబరు ఇస్తారు. ఆ నంబరును సొసైటీలో చూపిస్తే అక్కడ టీ-సీడ్ ఆప్‌లో రైతు వివరాల నమోదు చేస్తారు. అనం తరం రైతులకు 50శాతంపై రాయితీపై విత్త నాలను విక్రయిస్తారు.

● అన్నదాతలపై ఆర్థిక భారం

జీలుగ విత్తనాల ధరపెంచడం వలన అన్న దాతలపై ఆర్థికభారం పడుతోంది. గతంలో మాదిరిగానే 50శాతం రాయితీ వర్తింపజేసినా ధర పెరగడం వల్ల రైతులపై రూ.1,024 అదన పు భారం తప్పడం లేదు. ప్రభుత్వం ఎక్కువ ధరకు కొనుగోలు చేసిందని రైతులపై భారం వేయడం తగదని రైతులు, రైతు సంఘం నాయకులు మండిపడుతున్నారు.

● ధర పెరగడంతో నష్టపోతున్నాం

- అనివేని శ్రీనివాస్ రైతు, స్తంభంపల్లి



విత్తనాల ధర పెంచడంవల్ల ఆర్థిక భారం ఎక్కువై తీవ్రంగా నష్టపోతున్నాం. జీలుగ విత్తనాల ధర రెట్టింపు చేయడమంటే రైతులను మోసం చేయడమే. ఇప్పటికే తీవ్ర కష్టాలు చవి చూస్తున్నాం. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

● రైతులపై భారం వేయడం సరికాదు

- సింగం చంద్రయ్య రైతు, ముత్తునూర్



జీలుగ విత్తనాల సేకరణకు ప్రభుత్వం ఎక్కు వ ఖర్చు చేసిందనే సాకుతో రైతులపై భారం వేయడం సరికాదు. గతంలో విత్తనాలు తక్కువ ధరకు లభిం చేవి. విత్తనాల ధర పెంచడం వలన సాగు చేద్దామంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి వచ్చింది.

'ఆర్‌ఎంపీ, పీఎంపీల సేవలు అభినందనీయం'

ధర్మపురి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల ఆర్‌ఎంపీ, పీఎంపీల సేవలు అభినంద నీయమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండల ఆర్‌ఎంపీ, పీఎంపీ నూతన కార్యవర్గ పదవీ స్వీకార ప్రమాణోత్సవానికి ఆదివారం ఆయన హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలు వైద్యం చేయడం గొప్పగా భావించాలన్నారు. అనంతరం ఆయన నూతన కార్యవర్గాన్ని ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ధర్మపురి మండల ఆర్‌ఎంపీ, పీఎంపీ అధ్యక్షులు వేముల నరేష్, ప్రధాన కార్యదర్శి ఒడ్డేటి నరేష్, కోశాధికారి కడారి గంగాధర్, మాజీ అధ్యక్షులు మామిడాల రవీందర్, అప్పాల రాజ లింగం తదితరులు పాల్గొన్నారు.



అడవిలో కలప దొంగలు

- ఓబులాపూర్ అటవీ ప్రాంతంలో టేకు చెట్లు నరికివేత
- అధికారుల పర్యవేక్షణ కరువు

4

నెరవేరనున్న కల

- చివరి దశకు ఇటిక్యాల-రామారావుపల్లె వంతెన పనులు
- రూ.9కోట్ల నిధులతో నిర్మాణం

6

నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవం

● జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న విప్ అడ్లూరి



వేడుకలకు ముస్తాబైన సమీకృత కలెక్టరేట్ భవనం

జగిత్యాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. ఉదయం 9.30 గంటలకు కరీంనగర్ రోడ్డులో గల అమర వీరులస్థూపం వద్ద నివాళులతో కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. కలెక్టరేట్‌లో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై పతాకావిష్కరణ చేయనున్నారు. జాతీయ గీతాలాపన, తెలంగాణ గీతాలాపన, పోలీస్ గార్డ్స్ ద్వారా వందన సమర్పణ నిర్వహించనున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. తర్వాత వందన సమర్పణతో కార్యక్రమ ముగింపు జరగనుంది. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎస్పీ అశోక్ కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు హాజరుకానున్నారు.

సేవా పతకాలకు ఎంపికైన జిల్లా పోలీసులు

జగిత్యాల క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌శాఖలో విశేష సేవలం దించినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన సేవా పతకాలకు జిల్లా పోలీసులు ఎంపికయ్యారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ విభా గంలో పనిచేస్తున్న ఏఆర్‌ఎస్సై రామస్వామి, ఎస్‌బీలో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌లు ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. మెట్ పల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైలుగా పనిచేస్తున్న జమీల్ అహ్మద్, నరసిం హారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్‌లు సేవా పతకాలకు ఎంపికయ్యారు.

స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై బిక్షపతి, కోరుట్ల ఏఎస్సై సత్తయ్య, ఏఆర్‌ఎస్సై శ్రీనివాస్, మల్యాల హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి, కథలాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కాని స్టేబుళ్ల నీల్య నాయక్, శ్రీనివాస్‌లు సేవా పతకాలకు ఎంపికయ్యారు. మల్యాల, మేడిపల్లి, గొల్లపల్లి, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు రవి, ఇలియాస్ అహ్మద్, రాజమౌళి, తనోబాలు సేవా పతకాలకు ఎంపికయ్యారు. వీరితో పాటు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు మల్లారెడ్డి, నాగన్నలు ఎంపికయ్యారు. సేవా పతకాలకు ఎంపికైన వారిని ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

నేటి ప్రజావాణి రద్దు

● కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆదివారం కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తు న్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని ఆయన ప్రకటించారు.

'పట్టణ అభివృద్ధికి చర్యలు'



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, జూన్ 01 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని 29వ వార్డులో 21 లక్షల రూపాయలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగిత్యాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. అంతకు ముందు జగిత్యాల పట్టణ పావని కంటి ఆసుపత్రి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జగిత్యాల నియోజక వర్గానికి చెందిన 19 మంది నిరుపేదలకు ఉచిత ఆపరేషన్లు నిర్వహించి అద్దాలు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గంగాధర్

రాయికల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణ మాల సంక్షేమ సంఘం అధ్యక్షునిగా చెంగళి గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గంగాధర్‌ను ఆదివారం కుల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పురె శ్రీనివాస్, గుర్రం రత్నాకర్, భైరి రాజేందర్, నారాయణ, గంగరాజం తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల వాహన తనిఖీలు

కోరుట్ల రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని మాదాపూర్ ఎక్స్ రోడ్డు, అయిలాపూర్, కల్లూర్ రోడ్డులో ఆదివారం పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీని నిర్వహించారు. ఈసందర్భంగా డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారి వాహనదారులకు జరిమానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 8మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆయిల్‌పామ్ తోట దగ్ధం


కొసునూర్‌పల్లె గ్రామంలో దగ్ధమవుతున్న ఆయిల్ పామ్ తోట

దర్మపురి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దర్మపురి మండలంలోని కొసునూర్‌పల్లె మాజీ సర్పంచ్ ఎన్నం లక్ష్మారెడ్డికి చెందిన ఆయిల్ పామ్‌తోట విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఆదివారం దగ్ధం అయ్యింది. రెండున్నర ఏళ్ల క్రితం మూడు ఎకరాల్లో లక్ష్మారెడ్డి ఆయిల్ పామ్‌తోట పెంపకం చేపట్టారు. మధ్యాహ్నం వీచిన గాలుల వల్ల విద్యుత్ వైర్లలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచి ఆయిల్ పామ్ తోటలో చెట్లు కాలిపోయాయి. పైపు లైన్ కాలిపోవడంవల్ల భారీనష్టం వాటిల్లింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు, మాజీసర్పంచ్ ఎన్నం లక్ష్మారెడ్డి కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చేగుర్తి గ్రామశివారులో ఆదివారం అక్రమంగా ఇసుకతరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ యజమాని పత్తి అజయ్ పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. మరోసారి ఇదే నేరానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ

• సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు • ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

గణేశ్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులు తమకు ఇష్టమైన రంగంలో శిక్షణ తీసుకుంటారు. క్రీడలు, స్విమ్మింగ్, కరాటే, స్పోకెన్ ఇంగ్లీష్ వంటివి నేర్చుకుంటారు. మరికొందరు సంగీతం, వివిధ రకాల కళలను నేర్చుకుంటారు. ప్రస్తుత పోటీ



ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు వేసవి సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ ఇప్పిస్తున్నారు. దీంతో పట్టణాల్లో కంప్యూటర్ సెంటర్లు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. మరో వైపు యువత ఉద్యోగానికి అవసరమైన శిక్షణ తీసుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల యువత, విద్యార్థులు వేసవి సెలవుల్లో ప్రతిరోజు జిల్లా కేంద్రంలోని కంప్యూటర్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. కొందరు ఉపాధి కోసం మరికొందరు ఉన్నత చదువుల కోసం శిక్షణ తీసుకుంటున్నారు.

● డిమాండ్ ఉన్న కోర్సులు

కంప్యూటర్ కోర్సుల్లో ఎంస్ ఆఫీస్ ప్రతి ఒక్కరూ నేర్చుకునేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. ఫొటోషాప్, డీటీపీ, టాలీ, ఆటో కాడ్ వంటి కోర్సులు నేర్చుకుంటున్నారు. వీటి తర్వాత పీజీడీసీఏ ఆరు నెలల కోర్సు కావడంతో అవసరం ఉన్నవారు మాత్రమే దానిని ఎంచుకుంటారు. శిక్షణ పొందిన వారు కొందరు ఇంటర్‌నెట్ సెంటర్లలో, కళాశాలలు, ఆస్పత్రుల్లో కంపూటర్ ఆపరేటర్లుగా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు నెల రోజులు పాటు ఇచ్చే శిక్షణకు రూ.2000 వరకు తీసు కుంటున్నారు. శిక్షణ అనంతరం పరీక్ష నిర్వ హించి కేంద్ర ప్రభుత్వం అనుమతి పొందిన ఐఎస్‌ఓ సర్టిఫికెట్ అందజేస్తున్నారు.


కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి
- శ్రీధర్, ఓంకార్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా కంప్యూటర్ అనుసంధానంగానే పనులు జరుగుతున్నాయి. గతంలో అవసరం ఉంటేనే కంప్యూటర్ నేర్చుకునేవారు.. కానీ నేడు కంప్యూటర్ నేర్చుకొని ఉండటం తప్పనిసరి. శిక్షణ అనంతరం కొంత మందికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నాం. మా వద్ద శిక్షణ తీసుకున్న వారు కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తక్కువ ఫీజు
- బంధారపు అజయ్, స్పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, చొప్పదండి



గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నాం. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు బీటెక్‌లో ఉండే సిలబస్‌ను ముందుగానే వేసవి సెలవుల్లో అవగాహన కల్పిస్తున్నాం. టెన్త్, ఇంటర్ డిగ్రీ విద్యార్థులకు కంప్యూటర్ విద్య తప్పనిసరిగా అవసరం. ఏం చదువుకున్నా ఉద్యోగ సమయంలో కంప్యూటర్ చాలా ఉపయోగపడుతుంది.

ఉపాధి పొందేందుకు శిక్షణ
- అక్బర్, విద్యార్థి



వేసవి సెలవులను వృథా చేయకుండా ప్రస్తుతం నగరంలోని ఓంకార్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌లో టాలీ నేర్చుకుంటున్నా. టాలీపై పట్టు సాధించి ప్రభుత్వ ప్రైవేట్ ఏదైనా ఉద్యోగంలో చేరాలనేది నా కోరిక. ఇక్కడ సులభంగా అర్థమయ్యే విదంగా నేర్పిస్తున్నారు.

భవిష్యత్ కోసం
- ఎస్ హిరణ్య, విద్యార్థిని



నేను ఇంటర్ పూర్తిచేశాను. చొప్పదండిలోని స్పేస్ కంప్యూటర్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్నాను. ఉన్నత చదువుల కోసం, భవిష్యత్ ఉద్యోగ ప్రయత్నాల్లో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎంఎస్ ఆఫీస్ నేర్చుకుంటున్నా.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

రామగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్‌లో పేకాట ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు ఆదివారం సిబ్బందితో బేగంపేట్‌లో దాడులు నిర్వహించగా పేకాట ఆడుతూ ముగ్గురు వ్యక్తులు పట్టుపడ్డారన్నారు. వారివద్ద నుంచి 2,310 రూపాయలు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వన్ టౌన్ ఎదుట ఉన్న ఒక లాడ్జి సమీపంలో ఆదివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. చనిపోయిన వ్యక్తికి సుమారు 55 ఏళ్లు ఉంటాయని, ప్రభుత్వాస్పత్రిలోని మార్చూరిలో భద్ర పరిచామని పేర్కొన్నారు. మృతుడిని గుర్తించినవారు ఒకటో టౌన్ పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

మల్లాపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలంలోని ఒడ్డెరకాలనీకి చెందిన దండుగుల శ్రీనివాస్(22) అనే యువకుడు ఆదివారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు. శ్రీనివాస్ రెండేండ్ల క్రితం హైదరాబాద్‌లో లాండ్రి సెంటర్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. తల్లికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో మల్లాపూర్‌లోనే ఉంటున్న శ్రీనివాస్ జీవితంపై విరక్తి చెందాడు. ఆదివారం ఉదయం గ్రామశివారులోని చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణం పొందాడు. అటు వైపు వెళ్తున్న స్థానికులు గమనించి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ చిన్నతాత శివరాత్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి బలవన్మరణం

రామడుగు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో జీవితం మీద విరక్తి చెందిన వృద్ధురాలు బావిలోదూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దేశరాజుపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దేశరాజుపల్లి గ్రామానికి చెందిన ఈరుమల్ల బాలమ్మ(74) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆపరేషన్‌కు భయపడిన ఆమె శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త ఈరుమల్ల కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ముస్తాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడూర్ స్టేజి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలకేంద్రానికి చెందిన కూర సిద్ధిరాములు(53) మృతిచెందాడు. సిద్ధిరాములు తన ద్విచక్రవాహనంపై ముస్తాబాద్‌కు వస్తుండగా గూడూర్ స్టేజి వద్ద ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ గణేష్ పరిశీలించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమ్తిం సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని ఢీకొట్టిన కారు

● అక్కడికక్కడే మృతి


కొమురయ్య(ఫైల్)

సుల్తానాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుకులలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న తాళ్లపల్లి కొమురయ్య (85) అనే వృద్ధుడిని ఆదివారం కారు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కొమురయ్య అల్లుడు ఇల్లెందుల శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామునిపల్లికి చెందిన తాళ్లపల్లి కొమురయ్య ప్రతీరోజు మధ్యాహ్నం, రాత్రి పూటభోజనం కోసం కనుకులలోని కూతురు ఇంటికి నడుచుకుంటూ వచ్చివెళ్తుండేవాడు. ఆదివారం మధ్యాహ్నం కూడా అలాగే నడుచుకుంటూ వస్తుండగా వెనక వైపు నుంచి కారు కొమురయ్యను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలతో వృద్ధుడు అక్కడికక్కడే చనిపోయారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుబాయిలో ముత్యంపేట వాసి ఆత్మహత్య

● స్వగ్రామం చేరిన మృతదేహం


శ్రీనివాస్(ఫైల్)

మల్యాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం ముత్యంపేట కొండగట్టుకు చెందిన పంజాల శ్రీనివాస్‌గౌడ్(54) అనే వ్యక్తి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి మూడు నెలలక్రితం ఆత్మహత్య చేసుకోగా ఆదివారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. శ్రీనివాస్‌గౌడ్ రెండేళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 21న ఆత్మహత్య చేసుకోవడంతో అక్కడి పోలీసులు మార్చురీలో భద్రపరిచారు. కంపెనీ వీసా కాకపోవడంతో మూడు నెలల గడిచినా ఆచూకీ లభించకపోగా ఫింగర్‌ప్రింట్స్ ఆధారంగా పది రోజుల క్రితం కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షుడు నర్సింహ దృష్టికి కూడా వెళ్లడంతో ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్ ద్వారా వివరాలు సేకరించారు. దుబాయిలో గల ప్రభాకర్ తదితరుల చొరవతో శ్రీనివాస్‌గౌడ్ మృతదేహం ఆదివారం స్వగ్రామం చేరుకుంది.

అడవిలో కలప దొంగలు

● యథేచ్ఛగా టేకు చెట్లు నరికివేత
● ఓబులాపూర్ అటవీ ప్రాంతంలో నిత్యకృత్యంగా కలప తరలింపు
● అధికారుల పర్యవేక్షణ కరువు


నరికివేయగా మిగిలిన చెట్టు మొదలు


నరివేయడంతో బోసిగా కనిపిస్తున్న టేకు చెట్ల మొదలు

మల్యాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గతంలో రాష్ట్ర స్థాయిలో పేరొందిన ఓబులాపూర్ అటవీ ప్రాంతంలో ప్రస్తుతం కలపదొంగలు పెట్రేగిపోతున్నారు. యథేచ్ఛగా టేకుచెట్లను నరికివేస్తూ అక్రమంగా తరలిస్తున్నారని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓగులాపూర్ గ్రామం అటవీ ప్రాంతం పచ్చని గుట్టల మధ్య ఉండగా ఇక్కడ దాదాపు 4,619 ఎకరాల పరిధిలో అటవీవిస్తీర్ణం ఉంది. సుమారు ఇరవై ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం వనసంరక్షణ సమితిలను ఏర్పాటు చేయగా ఇక్కడ కూడా గ్రామస్థులు సమష్టిగా వనం పెంపుకు కృషి చేశారు. ముఖ్యంగా టేకు వనం పెంచడంతో ఈప్రాంతంలో అటవీవిస్తీర్ణం పెరిగింది. అయితే కొన్నాళ్లుగా విచక్షణ రహితంగా ఇక్కడ టేకు వనాలను నరికి వేస్తున్నారు.

● ప్రతి నిత్యం అక్రమంగా తరలింపు

ఓబులాపూర్ అటవీప్రాంతం వేలాదిఎకరాల్లో పరచుకొని ఉండడంతో ఓబులాపూర్‌తో పాటు గొర్రెగుండం, ఒడ్యాడు తదితర ప్రాంతాల శివార్ల వరకు టేకు వనం ఉంది. అయితే కొందరు కలప దొంగలు నిత్యం టేకు కలపను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. సంబంధిత అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, మొక్కుబడి పర్యవేక్షణలతో కలప తరలుతోందని ఓబులాపూర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒడ్యాడు మార్గంలో కొన్నాళ్ల క్రితం వంట చెరుకు పేరిట నరికివేసి తరలించడానికి సిద్ధంగా ఉంచిన కలపను పట్టుకొని నామమాత్రపు జరిమానాలు విధించారనే చర్చ జరిగింది. అటవీ ఉన్నతాధికారులు దృష్టిసారించి చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని, నిత్యం గస్తీకోసం చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ బీట్ అధికారి వసీంను వివరణ కోరగా.. టేకు కలప నరికివేత ప్రదేశాలను గుర్తించి మరోసారి అలా జరుగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. టేకు కలప నరికిన వారిపై పలుమార్లు జరిమానాలు కూడా విధించడం జరిగిందని, టేకు కలప సంరక్షణకు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు


జయ్యారంలో బోనాలతో మహిళలు

పాలకుర్తి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మండలంలోని జయ్యారం గ్రామంలో గ్రామ దేవత పోచమ్మకు ఘనంగా బోనమెత్తారు. ఆదివారం గౌడ సామాజిక మహిళలు ప్రతీఇంటి నుంచి బోనం తయారుచేసుకొని డప్పు చప్పుళ్లతో ఆలయానికి తరలి వెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.

ఈయేడూ ఇక్కట్లేనా?

● రూ. 1.30 కోట్లు మంజూరైనా ప్రారంభం కాని రోడ్డు పనులు ● వెయ్యి మంది విద్యార్థులకు కష్టాలు


వర్షాకాలంలో నీటిలో నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థులు(ఫైల్)

కథలాపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మోడల్‌స్కూల్, ప్రభుత్వజూనియర్ కళాశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలకు వెళ్లేందుకు ఉన్నది ఒకేఒక రోడ్డు. వర్షాలు కురిశాయంటే ఈ పాఠశాలల్లో చదివే సుమారు వెయ్యిమంది విద్యార్థుల బాధలు వర్ణణాతీతంగా ఉంటాయి. మోకాలి లోతు నీటిలో కళాశాల, పాఠశాలలకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి. పదేళ్లుగా ఎమ్మెల్యేలు, ఎంపీలకు అధ్యాపకులు, విద్యార్థులు అనేక వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదు. రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేసినా వానలకు కొట్టుకుపోవడం సర్వసాధారణంగా మారింది. అయితే వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎంఆర్ఆర్ గ్రాంట్ కింద రోడ్డు నిర్మాణానికి రూ. 1.30 కోట్లు మంజూరుచేయించారు. నాలుగు మాసాల క్రితం శంఖుస్థాపన కూడా చేశారు. ఈ పనులు చేపట్టడానికి ఓ కాంట్రాక్టర్ ముందుకు వచ్చి అగ్రిమెంట్ చేసుకున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పలుమార్లు రోడ్డును పరిశీలించినా పనులు ప్రారంభించడంలో విపరీత జాప్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామం పైభాగం నుంచి వచ్చే మురికినీటిని కూడా మళ్లించడానికి మురికి కాలువ కూడా ఇదే ప్యాకేజీలో తీసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కస్తూర్బాగాంధీ పాఠశాల మీదుగా జూనియర్ కాలేజీ దాకా నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ కాలువ నిర్మాణం కోసం లెవెల్‌తీసి వదిలేశారు. ఈ క్రమంలో వర్షాలు కురుస్తున్నందువల్ల పనులకు ఆటంకం కలిగే పరిస్థితి నెలకొంది. వేసవి కాలంలోనే రోడ్డు, కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేయడంలో జాప్యం చేశారనే విమర్శలు వస్తున్నాయి.

కాంట్రాక్టర్ కంకర, ఇసుక, స్టీల్ వంటి సామగ్రి పనిప్రదేశంలో సిద్ధంగా ఉంచుకున్నప్పటికీ అధికారులు పనుల కొనసాగింపులో ఎందుకు తాత్సారం చేస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ ఏడాది కూడా తమకు నీటి కష్టాలు తప్పవని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

భక్తులతో కిక్కిరిసిన మల్లన్న క్షేత్రం


మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం వేలాది మంది భక్తులతో కిక్కిరిసింది. రోహిణి కార్తె ప్రవేశంతో వ్యవసాయ పనులకు సిద్ధమయ్యే ముందు రైతన్నల కుటుంబాలు వేలాదిగా తరలివచ్చి మొక్కులను సమర్పించారు. అలాగే కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, మంచిర్యాల, వరంగల్, సిద్దిపేట తదితర జిల్లాల నుంచి వాహనాల్లో దాదాపు 20 వేల పైచిలుకు మంది భక్తులు జాతరకు తరలివచ్చి మల్లికార్జున స్వామి, మధన పోచమ్మ, బంగారు పోచమ్మలను దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయంలో కోడెలతో ప్రదక్షిణలు నిర్వహించారు. భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి, బోనాలతో మల్లన్నకు సమర్పించారు. క్యూ లైన్‌లో భక్తులు మూడు గంటల సమయం వరకు వేచి ఉండి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి భక్తుల సంఖ్య అధికంగా పెరగడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దీంతో భక్తులు బోనాలు సిద్ధం చేసేందుకు, సేదతీరేందుకు సరైన స్థల విస్తీర్ణం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వ్యవసాయ బావిలో పడి ఒకరి గల్లంతు


పోచయ్య(ఫైల్)

ఎలిగేడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్‌గ్రామానికి చెందిన కాంపల్లి పోచయ్య(67)అనేవ్యక్తి వ్యవసాయబావిలో మునిగి ఆదివారం గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపినవివరాల మేరకు.. మధ్యాహ్న సమయంలో పోచయ్య తన మనుమడికి ఈత నేర్పేందుకు పొలిమేరల్లో ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. మనుమడిని బావి మీదనే ఉంచి పోచయ్య బావిలో దిగి ఈత కొడుతూ ఊపిరాడక కొన్ని నిమిషాల్లోనే నీటిలో మునిగిపోయాడు. పోచయ్య కని పించకపోవడంతో బావిపై ఉన్న మను మడు ఇతరులు కేకలు వేయడంతో అంద రు బావివద్దకు వచ్చారు. విషయాన్ని జూల పల్లి పోలీసులకు తెలపడంతో గల్లంతైన పోచయ్యను బయటకు తీసేందుకు విద్యుత్ మోటార్లు పెట్టి నీటిని తోడుతన్నారు.

8 వరకే శుభముహూర్తాలు

- జూన్ 9 నుంచి జూలై 25 వరకు ముహూర్తాలు లేవు
- తిరిగి ఆగస్టు వరకు ఆగాల్సిందే



కరీంనగర్ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వివాహాది శుభకార్యాల నిర్వహణకు శుభముహూర్తాల కరువు ఏర్పడనుంది. ఈ నెలలో 8వ తేదీ వరకు మాత్రమే ముహూర్తాలు ఉన్నాయి. ఈ స్వల్ప వ్యవధిలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది సంఖ్యలో శుభకార్యాలు జరుగనున్నాయి. దీంతో పెళ్లి మండపాలు, పురోహితులు, బాజాభజంత్రీలు, ఈవెంట్స్ నిర్వాహకులు, వంటవారు, పూలు, అలంకరణలు, బట్టలు, బంగారం, కిరాణం వంటి వివిధ షాపుల వారికి గిరాకీ పెరగనుంది. ఆయా రంగాలకు చెందిన వ్యక్తులకు అడ్వాన్స్‌లు కూడా ముట్టాయి. అనంతరం ముహూర్తాల కోసం ఆగస్టు వరకు ఆగాల్సిందే 9వ తేదీ నుంచి గురు మౌఢ్యంతో పాటు జ్యేష్ఠ మాసం కావడంతో జూన్‌లో, ఆ తర్వాత జూన్ 26 నుంచి జూలై 24వ తేదీ వరకు ఆషాఢమాసం కారణంగా ముహూర్తాలు లేవు. జూలై 27వ తేదీ నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు శ్రావణమాసంలో తిరిగి 29 రోజుల పాటు ముహూర్తాలున్నాయి. ఆగస్టు 24వ తేదీ నుంచి భాద్రపదమాసం, సెప్టెంబరు 22వ తేదీ నుంచి ఆశ్వయుజమాసం కారణంగా అక్టోబరు 21వ తేదీ వరకు ముహూర్తాలు లేవు. అక్టోబరు 24 నుంచి తిరిగి ముహూర్తాలు ఉన్నాయి.

ఫుల్ క్రేజీ.. బాస్కెట్ బాల్





- జిల్లాలో ఆదరణ ఉన్న ఆట
- శిక్షణ శిబిరాలకు పెద్ద సంఖ్యలో హాజరవుతున్న చిన్నారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ క్రీడకు జిల్లాలో మంచి ఆదరణ ఉంది. ఏటా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాలకు చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. 2017, 2018లో జరిగిన శిబిరంలో 100 లోపు, 2019లో సుమారు 300 మంది, ప్రస్తుతం 200 మందికి పైగా చిన్నారులు శిక్షణ పొందుతున్నారు.

● ఆడే విధానం...

ప్రతి టీంలో 12 మంది క్రీడాకారులు ఉంటారు. వీరిలో ఏడుగురు సబ్‌స్టిట్యూట్‌లుగా ఉండగా, ఐదుగురు ఆట ఆడతారు. రెఫరీ ఆటను ప్రారంభించే ముందు రెండు టీంల మధ్య జంప్‌బాల్ ఎగురవేసి ఆటను ప్రారంభిస్తారు. లైన్ బయటి నుంచి గోల్ చేస్తే మూడు పాయింట్లు ఇస్తారు. రెండు పాయింట్ల జోన్ నుంచి వేస్తే రెండు పాయింట్లు ఇస్తారు. ఫ్రీ త్రో నుంచి వేస్తే ఒక్క పాయింట్ ఇస్తారు. ఇలా ఏ జట్టు ఎక్కువగా స్కోర్ సాధిస్తే దానిని విజేతగా నిర్ణయిస్తారు.



బాస్కెట్‌బాల్ ఆడుతున్న బాలికలు

శిక్షణ బాగుంది..

\- సాత్విక



గతంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో స్విమ్మింగ్‌లో శిక్షణ తీసుకున్నా. ఇప్పుడు బాస్కెట్‌బాల్‌లో ట్రైనింగ్ తీసుకుంటున్నా. కోచ్‌లు బాగా శిక్షణ ఇస్తున్నారు.

జాతీయ స్థాయిలో ఆడాలని ఉంది..

\- విఖ్యాత్



బాస్కెట్‌బాల్ గేమ్ అంటే చాలా ఇష్టం. స్కూల్‌లో కూడా ప్రాక్టీస్ చేస్తా. సమ్మర్ క్యాంపు ప్రారంభం నుంచి వస్తున్నా. గేమ్‌లో టెక్నిక్‌లు అన్ని నేర్చుకుని రాష్ట్ర, జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాలనేది లక్ష్యం.

గత సంవత్సరం నుంచి వస్తున్నా..

\- స్వప్నిక



ప్రస్తుతం బాస్కెట్‌బాల్‌ను ఆడేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. నేను గత సంవత్సరం పెట్టిన సమ్మర్ క్యాంపునకు కూడా వచ్చాను. మంచిగా ప్రాక్టీస్ చేసి బాస్కెట్‌బాల్‌గా చాంపియన్‌గా ఎదగాలని ఉంది.

వాటర్ ట్యాంక్ ఎక్కి యువకుడి ఆత్మహత్యాయత్నం

- కానిస్టేబుల్ కౌన్సెలింగ్‌తో కిందికి దిగిన యువకుడు

కరీంనగర్ క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన పేరెళ్ల సన్ని అలియాస్ దయాసాగర్ ఆదివారం కుటుంబసభ్యులతో గొడవపడి వాటర్‌ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించగా కానిస్టేబుల్ కౌన్సెలింగ్‌తో కిందికి దిగివచ్చాడు. పోలీసుల వివరాల ప్రకారం.. దయాసాగర్ ఆదివారం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడి దాడికి దిగాడు. అనంతరం గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. డయల్ 100 ద్వారా కొత్తపల్లి పోలీసులకు విషయం తెలియగానే కానిస్టేబుల్ విజయరావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. దయాసాగర్‌తో మాట్లాడుతూ కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో యువకుడు కిందకు దిగి వచ్చాడు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ విజయరావును కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్, కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి అభినందించారు.

సువిశాలమైన గోశాల నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సూచించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామికి ఎంతో ప్రీతికరమైన కోడెల సంరక్షణ కోసం అత్యాధునిక వసతులతో, సువిశాలమైన నూతన గోశాల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించినట్లు ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల ఖతర్ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి తిరిగి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వేములవాడ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఇటీవల రూ.200కోట్లతో వేములవాడ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేయడంపై, ఇటీవల ఏఐసీసీ ప్రకటించిన కమిటీల్లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ, డీలిమిటేషన్ కమిటీ సభ్యులుగా నియమించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఖతర్ పర్యటన వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. రాజన్న ఆలయంలో జరగబోవు అభివృద్ధి, గోశాలలో జరుగుతున్న పలు అంశాలపై ముఖ్యమంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారనారు. గోశాలలోని కోడెలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అత్యాధునిక వసతులతో సువిశాలమైన స్థలంలో నూతన గోశాల నిర్మాణం కోసం స్థలసేకరణ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారని, కోడెలు మృతిచెందడం బాధాకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, కోడెలు అనారోగ్య బారినపడకుండా ప్రభుత్వం, ఆలయం తరపున జాగ్రత్తల తీసుకుంటామని వివరించారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నిరుపేద విద్యార్థులకు అండగా కపిల్ 'విద్యావారధి'

- పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల పైచదువులకు సహకారం

భగత్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు సంక్షేమ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో సువర్ణ అవకాశం కల్పిస్తున్నట్లు ట్రస్ట్ ఉపాధ్యక్షుడు అప్పిడి రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులులేని, నిరుపేద, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన, 470పై మార్కులు సాధించిన విద్యార్థులకు వారు స్థిరపడే వరకు ఏ కోర్సు చేసినా అయ్యే ఖర్చులను కపిల్ విద్యావారధి భరిస్తుందన్నారు. ఇందుకు ఈనెల8న అర్హతపరీక్ష ఉంటుందన్నారు. ఉమ్మడి కరీంనగర్‌జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ట్రస్ట్‌ఈఅవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు కపిల్ విద్యావారధి ఆర్గనైజేషన్‌ద్వారా ఆన్‌లైన్‌లో జూన్‌5వతేదీవరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్‌8న కరీంనగర్‌లో అర్హతపరీక్ష ఉంటుంద న్నారు. ఈ అవకాశాన్ని పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఫిజికల్ డైరెక్టర్ మృతి



కదారి రవి(ఫైల్)

కరీంనగర్ స్పోర్ట్స్/పెద్దపల్లి కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ కదారి రవి(57) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హైదరాబాద్‌కు తనకారులో వెళ్తుండగా సిద్దిపేట జిల్లా కొముురవెల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో కారుటైరు పగిలి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న రవికి తీవ్రగాయాలయ్యాయి.వెంటనే సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. కదారి రవి ప్రస్తుతం పెద్దపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఫీజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా, వ్యాయామ విద్య ఉపాధ్యా య రీసోర్స్ పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఉమ్మడి జిల్లా అథ్లెటిక్ క్రీడాకా రుడిగా జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో రాణించారు.

● పూర్వ విద్యార్థుల సమ్మేళనం సంతాప సభగా...

దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల (1991) పూర్వ విద్యార్థుల సమ్మేళనం, జింఖానా గ్రౌండ్స్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్ పోటీలకు వెళ్లేందుకు ఆదివారం ఉదయం కరీంనగర్ నుంచి బయల్దేరిన రవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం రవి సంతాప సభగా మారింది.

● పలువురి సంతాపం

కదారి రవి మృతితో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడారంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల డీవైఎస్‌వోలు శ్రీనివాస్‌గౌడ్, సురేష్, రాందాస్, రవి, ఉమ్మడి జిల్లా ఒలంపిక్‌సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, మహ్మద్ కరీం, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లిజిల్లాల పీఈటీల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అంతటి శంకరయ్య,శ్రీనివాస్, బాబుశ్రీనివాస్,ఆడెపు శ్రీనివాస్, వేల్పుల సురేందర్, దాసరి రమేశ్ తదితరులు సంతాపం తెలిపారు.

● పెద్దపల్లి డీఈవో మాధవి, మండల విద్యాధికారి సురేందర్, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేందర్ కరీంనగర్‌లోనివాళులర్పించారు.

భక్తజన సంద్రంగా మారిన రాజన్న ఆలయం

- 70 వేలకు పైగా రాజన్నను దర్శించుకున్న భక్తులు..
- రాజన్న దర్శనానికి నాలుగు గంటల సమయం..



రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మ దర్శనం, కోడె మొక్కు క్యూలైలో భక్తులు సుమారు నాలుగు గంటలకు ఆలయంలోకి చేరుకొని శ్రీపార్వతి రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనుబంధాలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామిని 70 వేల మంది వరకు భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అత్యాధునిక గోశాలల ఏర్పాటు హర్షణీయం

కరీంనగర్ అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యాధునిక సౌకర్యాలతో 50ఎకరాల విస్తీర్ణంలో గోశాలలను ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై కరీంనగర్ జీవకారుణ్య సమితి ఉమ్మడి జిల్లా కార్యదర్శి, న్యాయవాది డాక్టర్ జి కొముురయ్య హర్షం వ్యక్తం చేశారు. జీవకారుణ్య సమితి తరపున సీఎంకు అభినందనలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిజిల్లాలో అత్యాధునిక సౌకర్యాలతో 50ఎకరాలలో గోశాలలను ఏర్పాటు చేసి గోవుల ద్వారా సమకూరే పేడ, గోమూత్రం రైతులకు అందించి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కొముురయ్య కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల విక్రయం

హుజూరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గోస్కుల అజయ్ అన్నారు. ఆదివారం హుజూరా బాద్‌లో ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్‌లోని పలుప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నోట్‌పుస్తకాలు, టై, బెల్ట్‌లు అమ్ముతున్నారన్నారు. పుస్తకాల విక్రయం ఆపకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ సమస్యపై విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన విశ్రాంత ఉద్యోగులు

భగత్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీజేపీ విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగ, రాష్ట్ర సెల్ కో-చైర్మన్ నరహరి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో నిర్వహించిన విశ్రాంతఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పీఆర్సీ, డీఏలు ఇవ్వడం లేదని, రిటైర్‌మెంట్ అయిన వారికి పెన్షన్, జీపీఎఫ్ డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదంటూ న్యాయమైన సమస్యలను పరిష్కరించక పోవడం శోచనీయమన్నారు. ఉద్యోగులు ప్రభుత్వాన్ని కొత్త కోరికలు కోరడం లేదని, భేషజాలకు పోకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా సెల్ నాయకులు గంట్ల నర్సింహారెడ్డి, కర్ర ప్రభాకర్‌రెడ్డి, గోలి సత్యనారాయణరెడ్డి, పింగిలి ప్రతాపరెడ్డి, అబ్బిడి మాధవ రెడ్డి, ఈరెడ్డి తిరుమలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న కోడెల సంరక్షణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- పశు వైద్యాధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు, చికిత్సలు
- జీవాలకు మెరుగైన దాణా, పచ్చిగడ్డి ఇచ్చేలా ప్రణాళిక
- 32 మందికి రెండు చొప్పున 64 కోడెల పంపిణీ



కోడెలను అందిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులు

వేములవాడ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి కోడెల సంరక్షణకు పకడ్బందీగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. వేములవాడ పరిధిలోని తిప్పాపూర్‌లో ఉన్న వేములవాడ శ్రీరాజేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన గోశాలలోని 32 జతల కోడె పిల్లలను అర్హులైన రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోశాల ఆవరణలో మొత్తం పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ కోడె పిల్లలను పొందిన రైతులు వాటి సంరక్షణ బాధ్యతను పక్కాగా చూడాలని సూచించారు. వాటి నిర్వహణ తదితర అంశాల్లో ఏమైనా పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోశాల ఆవరణలో లోతుగా ఉన్న స్థలంలో మట్టిని పోయిస్తూ చదును చేస్తున్నామని తెలిపారు. కోడెలకు మెరుగైన దాణా, పచ్చిగడ్డి అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని వాటిని అందిస్తున్నామని వివరించారు. పశువైద్యాధికారుల బృందంతో జీవాలకు వైద్యం అందిస్తూ పర్యవేక్షిస్తున్నామని స్పష్టం చేశారు. హాజరైన ఆర్డీఓ రాధాభాయి, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఈఓ వినోద్ రెడ్డి, తహశీల్దార్ విజయ ప్రకాష్ రావు, మున్సిపల్ కమీషనర్ అన్వేష్, తదితరులు ఉన్నారు.

● నాలుగు రాజన్న కోడెలు మృతి..

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి తిప్పాపూర్ గోశాలలో ఆదవారం ఉదయం నాలుగు కోడలు అనారోగ్యంతో మృతిచెందాయి. ఘోశాలలో అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతున్న కోడెలు మృతిచెందాయి. మృతిచెందిన కోడెలను ట్రాక్టర్‌లో తరలించి మూలవాగులో ఖననం చేశారు.



కోడెలను అందుకున్న రైతులు

రాజన్న కోడెలకు వైద్య శిబిరం

- 500 పశువులకు ఎల్‌ఎస్‌డీ వ్యాక్సినేషన్
- అనారోగ్యం బారిన పడిన 16కోడెలకు చికిత్స
- అకాల వర్షాలు, అనారోగ్యంతో 17 కోడెల మృతి
- కోడెలు ఆరోగ్యంగా అయ్యే వరకు వైద్యం
- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి

సిరిసిల్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్‌లోని గోశాలలోని కోడెల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టామని, కోడెలు పూర్తిగా ఆరోగ్యంగా అయ్యే వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గోశాలలోని కోడెల విషయమై హెల్త్ బులిటెన్‌ను విడుదల చేశారు. అకాల వర్షాలు, అనారోగ్య పరిస్థితుల వల్ల వేములవాడ తిప్పాపూర్‌లోని గోశాలలో 8 కోడెలు మొదటగా మరణించగా, జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ఐదుగురు పశువైద్య డాక్టర్లతో కూడిన 12 మంది బృందం గోశాలలోని పశువులను పరిశీలించిందన్నారు. రెండో రోజు అనారోగ్య కారణాలతో మరో ఐదు కోడెలు మరణించాయని పేర్కొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన కోడెల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి 500 పశువులకు ఎల్‌ఎస్‌డీ వ్యాక్సిన్ వేశామని, అనారోగ్యంతో ఉన్న 20 పశువులకు ప్రత్యేక చికిత్స అందించి, వాటిలో 16 పశువులను రక్షించామని తెలిపారు. మరో నాలుగు కోడెలు మరణించాయని తెలిపారు. గోశాలలో ఇప్పటివరకు 17కోడెలు అనారోగ్య పరిస్థితులతో మరణించాయని, మిగిలిన పశువులు ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు. 64 కోడెలను స్థానిక రైతులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

మా జీ(వి)తాలు ఇంతేనా సారూ..?

-జగిత్యాల మున్సిపల్ పారిశుధ్య వాహన డ్రైవర్ల ఆవేదన -జీతాల్లో కోత విధించడంపై వినతులు



ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ డ్రైవర్లు, కార్మికులు(ఫైల్)

జగిత్యాల, జూన్1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్ పారిశుధ్య వాహనాల డ్రైవర్ల జీతాల్లో కోత విధించడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల పట్టణంలో చెత్త సేకరణకు మొత్తం 72 వాహనాలు వినియోగిస్తున్నారు. వీటికి సంబంధించిన 52మంది డ్రైవర్లకు కొంతకాలంగా రూ.20,500 వేతనాలను మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ప్రకారం చెల్లిస్తున్నారు. మిగిలిన 20మంది డ్రైవర్లకు నెలకు రూ.16,600 వేతనాలు చెల్లిస్తున్నారు. ఒకే పనికి వేర్వేరు వేతనాలు చెల్లించడంపై కార్మికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా తాజాగా 52 మంది డ్రైవర్లలో 18 మందికి గతంలో ఇస్తున్న 20,500కు బదులుగా 2025 ఏప్రిల్‌లో రూ.16,600 చెల్లించారు.

ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 69 ద్వారా కేవలం 34 మంది కార్మికులకే ఉన్నతాధికారుల నుంచి అప్రూవల్ వచ్చాయని రూ.20,500 చెల్లిస్తున్నామని, మిగతా 18మందికి రూ.16,600 సాధారణ జీతం మాత్రమే వేశామని అధికారులు అంటున్నారు. 18 మంది డ్రైవర్ల జీతాల్లో కోత విధించి రూ.16,600 మాత్రమే ఏప్రిల్ నెలలో తగ్గించి ఖాతాల్లో జమ చేశారు. దీంతో ఆ కార్మికులు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 15 ఏళ్లుగా మున్సిపాలిటీలో సేవలను అందిస్తున్న తమకు అర్ధాంతరంగా జీతాల్లో కోత విధించడం ఏమిటని కార్మికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త వారికి మాత్రమే ఈ జీవో వర్తిస్తుందని కార్మికులు అంటున్నారు. కౌన్సిల్ తీర్మానం ఉండగా తొక్కి, మిగతా వారి వివరాలు అప్రూవల్‌కి పంపకుండా తమను ఆయివేసే దిశగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. జీవో మార్గదర్శకాలు, కౌన్సిల్ తీర్మానాలను విస్మరించి వ్యవహరించి తమ జీతాల్లో కోతలు విధించారని కార్మికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కోత విధించిన 18 మంది డ్రైవర్లతో పాటు, గతంలో తక్కువ జీతాలు చెల్లించిన 20 మంది డ్రైవర్లకు సైతం నెలకు రూ.20,500 వేతనాలు అందించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

●విజ్ఞప్తులపై స్పందన కరువు

ఏప్రిల్ నెలలో జీతాలు తగ్గించి వేయడంపై మున్సిపల్ అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నా ఫలితం దక్కలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే హోదాలో పనిచేస్తున్న తోటి కార్మికులకు అధిక వేతనాలు పాత విధానంలో చెల్లించి, తమకు మాత్రం తగ్గించి వేతనాలు వేశారని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటివరకు ఎలాంటి ఫలితం కనిపించడం లేదని వారు వాపోతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని మున్సిపల్ కార్మికులు కోరుతున్నారు.

వేతనం తగ్గించారు

-బాలె రాజేశ్, మున్సిపల్ డ్రైవర్, జగిత్యాల



గత కొంత కాలంగా మున్సిపల్‌లో పారిశుధ్య వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. గత ఆర్థిక సంవత్సరం వరకు నెలకు రూ. 20,500 వేతనం పొందాను. ఏప్రిల్ మాసంలో సాంక్షన్ స్ట్రెంత్ జాబితాలో పేరు లేదంటూ వేతనం తగ్గించి రూ. 16,600 చెల్లించారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాను. యథావిధిగా వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

జీవో ప్రకారమే వేతనాల చెల్లింపులు

-స్పందన, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల



జీవో ప్రకారమే మున్సిపల్ పారిశుధ్య వాహనాల డ్రైవర్లకు వేతనాలు చెల్లిస్తున్నాం. డ్రైవర్ల జీతాల విషయంలో జీవో నంబరు 69లో పేర్కొన్న 34 మంది సాంక్షన్ స్ట్రెంత్‌కే పాత వేతనాలు చెల్లించాం. మిగిలిన వారికి నిబంధనల మేరకు పీహెచ్ వర్కర్ల జీతాలు చెల్లించాం. గత యేడాది నియామకమైన డ్రైవర్ల సంఖ్య పెంపునకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కార్యక్రమానికి హాజరైన రాయికల్‌లోని ప్రగతి పాఠశాల పూర్వ విద్యార్థులు

రాయికల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణ కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 2001-02లో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పట్టణ కేంద్రంలోని ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో గురుశిష్యుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఆనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్, కరస్పాండెంట్ బాలె జయశ్రీ, ఉపాధ్యాయులు రాజేశం, రాపర్తి నర్సయ్య, సత్యనారాయణ, పురుషోత్తం, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు దొంతి సతీష్, పొన్నం శ్రీకాంత్, తాటిపాముల రాజశేఖర్, భరత్, గట్టు నరేష్, నీలి రమేష్, జీవన్, అజయ్ పాల్గొన్నారు.

●కోడిమ్యాల: మండల కేంద్రంలోని విద్యాభారతి ఉన్నత పాఠశాలలో 1995-1996 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జస్టిస్ కుమారయ్య కల్యాణ మంటపంలో జరిగింది. ఈసమ్మేళనంలో విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురువులను శాలువా లను కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి

రాయికల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థుల పుట్టినతేదీ అప్‌డేట్ పెండింగ్‌లతో చదువుల అడ్మిషన్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సత్వరమే న్యాయం చేయాలని టీపీఎంఎస్‌ఈయూ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ అన్నారు. అపార్ ఐడీల జనరేషన్ సేవల్లో విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీలు మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అనుమతించడంతో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల అభీష్టం మేరకు అడ్మిషన్ రిజిస్టర్‌లో, యుడైస్‌లో అవసరమైన పదవ తరగతి, అన్ని విద్యార్థుల పుట్టిన తేదీలు, పేర్లు మార్పులు చేశారు. మార్పులు చేసిన వివరాలను ఎస్సెస్సీ బోర్డు హైదరాబాద్‌కు పంపించారు. అందులో కొందరివి అప్‌డేట్ కావడం, మరికొందరివి కాకపోవడంతో పదవ తరగతి పాసైన విద్యార్థుల ఆన్‌లైన్ మెమోలో పాత పుట్టిన తేదీలు రావడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ విద్యాశాఖకు వినతి పత్రం పంపినట్లు పేర్కొన్నారు.

రేపు హుండీ లెక్కింపు

కొడిమ్యాల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో వెలిసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు జూన్‌3న మంగళవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఉదుత వెంకన్న తెలిపారు.

గుడేటి రైతు సంఘం అధ్యక్షుడిగా రమేష్ రెడ్డి

రాయికల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామ గుడేటి రైతు సంఘం అధ్యక్షునిగా సోమ రమేష్ రెడ్డి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా తీగల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా క్యాతం రాజిరెడ్డి, క్యాషర్‌గా సోమ తిరుపతి రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మూడు నెలల రేషన్‌బియ్యం పంపిణీ

మల్యాల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసే రేషన్ బియ్యంను ప్రభుత్వఆదేశాల మేరకు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి ఈ జూన్ నెలలోనే పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ వసంత తెలిపారు. రేషన్ వినియోగదారులు మూడు నెలల బియ్యం తీసుకొని డీలర్లకు సహకరించాలని కోరారు.

ముష్టి గొల్ల సంఘం అధ్యక్షుడిగా మహిపాల్

కొడి మ్యాల, జూన్1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మయ్యపల్లి గ్రామ ముష్టి గొల్ల సంఘం అధ్యక్షునిగా జంగిడి మహిపాల్‌ను సభ్యులు ఆదివారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా జంగిడి కొమురయ్య, కార్యదర్శిగా మార్కం మల్లేష్, కోశాధికారి ఆరె సంతోష్‌ను ఎన్నుకున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రాయికల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన పులి శేఖర్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.21వేల చెక్కును జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ దావ వసంతసురేష్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, పీఏసీఎస్ చైర్మన్ యాదవనేని రాజలింగం, స్పందనసాగర్ రావు తదితరులు పాల్గొన్నారు.

భూపతిపూర్‌లో..

రాయికల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామానికి చెందిన కొమ్ములరాధ, బొద్దు పద్మ, గుగ్గిల మల్లేశం, రాజ్ కుమార్, కామని శశి కుమార్‌లకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.

మున్నూరుకాపుల సమ్మేళనం

మెట్‌పల్లి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోల్ హనుమాన్ మున్నూర్ కాపు పటేల్ సంఘ సభ్యులు ఆదివారం ఆషాఢ సమ్మేళనంగా ఏర్పడ్డారు. వేకవ జాములన సంఘ సభ్యులు డప్పు చప్పుల మధ్య పోచమ్మ తల్లికి వద్దకు ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో 'మాన్‌సూన్'

(3వ పేజీ తరువాయి)

గ్రూప్స్ మహిళలు, ఎన్జీవోలు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, శానిటేషన్ వర్కర్లను భాగస్వామ్యం చేయడానికి నిర్ణయించారు. ఇందుకు అవసరమైన ప్రచార పోస్టర్లు, ఆడియో, వీడియో రికార్డులను మున్సిపాలిటీలకు పంపారు. వందరోజుల ప్రణాళికకు అవసరమైన వసతుల ను సమకూర్చడంపై దృష్టి సారించారు. మున్సిపాలిటీల వారీగా నోడల్ ఆఫీసర్లను నియామకం చేశారు.

అన్ని చర్యలు తీసుకుంటాం..

-బీఎస్ లత, అదనపు కలెక్టర్



ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలలో వంద రోజుల ప్రణాళిక యాక్షన్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం చేశాం. ఏ రోజు ఏ కార్యక్రమం చేపట్టాలనే దానిపై అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశాం. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, పారిశుధ్య సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. అంటురోగాలు ప్రబలకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తాం.

వైభవంగా అనంత పద్మనాభ స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో అనంత పద్మనాభ స్వామి

కోరుట్ల రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామ శివారులోని పద్మనాభ స్వామి దేవాలయ వార్షికోత్సవ పురస్కరించుకొని స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. దేవాలయంలో మూల విరాట్‌కు ప్రత్యేక పూజలను నిర్వహించి అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. అనంతరం ప్రత్యేక వేదికపై అనంత పద్మనాభ స్వామి ఉత్సవ మూర్తులకు అలంకరించి కల్యాణం జరిపారు. దేవాలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి రావాలని పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి రావాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు పిడుగు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని జగ్గాసాగర్ గ్రామంలోని అతి పురాతనమైన కొండస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెనుకబడ్డ ప్రాంతంతో పాటు పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి, బీసీ రిజర్వుడైన ఎమ్మెల్యే బీసీలకు న్యాయం జరగాలంటే నిరంతరంగా అభివృద్ధి కోసం పాటు పడే ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. తమ కోరిక నెరవేరాలని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కు చెల్లించామన్నారు. కార్యక్రమంలో ఇల్లెందుల రాజు, పుప్పాల గంగాధర్, నల్ల బూమేష్, ఇత్తడి రవి, ఎండీ ఉస్మాన్, గొర్రె అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

-15 రోజులైనా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



గొల్లపల్లి శివారులో విరిగిపడిన విద్యుత్ స్తంభం

గొల్లపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రెవెన్యూ శివారులోని ఎస్సారెస్పీ డీ-64 కాలువ పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు పదిహేను రోజుల క్రితం గాలిదుమారానికి విరిగిపడినా అధికారులు పట్టించుకోవడం లేదు. వ్యవసాయానికి అందించే విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ సమస్యను నివారించేందుకు రైతుల డిమాండ్ మేరకు నెల రోజుల క్రితం ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు దానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడాన్ని మరిచిపోయారు. ఈ క్రమంలో పదిహేను రోజుల క్రితం గొల్లపల్లి మండల కేంద్రంలో ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షం దాటికి విద్యుత్ స్తంభాలు నేల పైన విరిగిపడ్డాయి. పదిహేను రోజులు గడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులకు పలుమార్లు సమాచారమందించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభాలు వేయిచ్చి విద్యుత్ సరఫరాను అందించాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన నిలిచిన మురికి నీరు

-పట్టించుకోని అధికారులు



పూడూర్‌లో నిలిచిన మురికి నీరు

కొడిమ్యాల, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని పూడూర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లే దారిలో కొన్నేళ్లుగా మురికి నీరు నిలిచినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి కెజ్జోలిని వివరణ కోరగా రోడ్డు పక్కన నిలిచిన నీటి ప్రదేశం నుండి గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో 12వేల రూపాయలతో ఒక ఇంకుడు గుంతను త్వరలో నిర్మిస్తామన్నారు. ప్రత్యేకంగా పైపులు వేయించి దానికి గ్రామానికి చెందిన ఒక్కరు ముందుకు వచ్చారన్నారు.

నెరవేరనున్న చిరకాల వాంఛ

-చివరి దశకు ఇటిక్యాల-రామారావుపల్లె వంతెన పనులు -రూ.9కోట్ల నిధులతో నిర్మాణం

రాయికల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుంది. మండలంలోని రామారావుపల్లె-ఇటిక్యాల పెద్ద వాగుపై వంతెన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. రెండేళ్ల కిందట ప్రభుత్వం రూ.9 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది, 90 శాతం పూర్తయ్యాయి. ఈ ఏడాది వర్షాలు కురవకముందే పనులు పూర్తి చేసి ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని రామారావుపల్లె గ్రామంలో సుమారు 120 కుటుంబాలు, 530 జనాభా ఉండగా, నిత్యం గ్రామస్థులు తమ అవసరాలకు రాయికల్ మండలానికి లేదా పక్కనున్న ఇటిక్యాల గ్రామానికి రావాలంటే మధ్యలో పెద్దవాగు ఉండడంతో వర్షాకాలంలో చుట్టూ సుమారు 10 కి.మీ. తిరిగి రావాల్సి వచ్చేది. వేసవిలో మాత్రమే వాగు దాటి వస్తుండేవారు.

వర్షాకాలంలో వాగు దాటుతుండగా గతంలో పలుమార్లు ప్రమాదాలకు గురయ్యారు. దశాబ్దాలుగా వాగుపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదించినా నిధులు మంజూరు కాక అవస్థలు పడ్డారు. మండలంలోని ఇటిక్యాల-రామారావుపల్లె గ్రామంలోని పెద్ద వాగుపై సర్వే చేసి వంతెన, ఇరువైపులా రహదారి నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు చేయగా రెండేళ్ల కింద పనులు ప్రారంభించారు. ఇటిక్యాల-రామారావుపల్లె పెద్ద వాగుపై 280 మీటర్ల మేర 16 పిల్లర్లపై స్లాబులు రెయిలింగ్ పూర్తి కాగా ఇటిక్యాల శివారులో రహదారి నిర్మాణ పనులు, చిన్న వంతెన నిర్మాణం పూర్తి చేస్తున్నారు. వర్షాలు రాకముందే పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. మధ్యలో బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో కొంత ఆలస్యమయ్యాయి. ప్రజాప్రతినిధుల చొరవతో ఎట్టకేలకు గత జనవరిలో పనులు పునః ప్రారంభించగా చివరి దశకు చేరుకున్నాయి. వంతెన నిర్మాణంతో మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాలకు రాయికల్ మరింత చేరువ కానుంది.



పెద్ద వాగుపై చివరి దశకు చేరిన వంతెన నిర్మాణం

బ్రిడ్జి నిర్మాణంతో దూరం తగ్గుతుంది

తిరుపతి, మాజీ సర్పంచ్, రామారావుపల్లె



బ్రిడ్జి పూర్తి కాకముందు ఇటిక్యాల-రేగుంట మీదుగా గ్రామానికి వచ్చేవాళ్లం. ప్రస్తుతం బ్రిడ్జి పూర్తవడంతో గ్రామానికి రావడానికి దూరం తగ్గింది. బ్రిడ్జి త్వరలోనే పూర్తి కానుండటంతో రామారావుపల్లెగ్రామానికి రవాణా భారం తగ్గుతుంది.

టీడీపీ మండల అధ్యక్షుడిగా రవిగౌడ్

గొల్లపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్న పేట గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు గర్వందుల రవిగౌడ్ టీడీపీ గొల్లపల్లి మండల శాఖ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒరగంటి భార్గవ రామ్ రవిగౌడ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యక్షులుగా రామవర పట్నం గ్రామానికి చెందిన ఊట్కూరి సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బొంకూర్ గ్రామానికి చెందిన సాంబారి సంతోష్, కార్యనిర్వహణ కార్యదర్శులుగా రాగల శంకర్ (వెంగళాపూర్), ముదాం లక్ష్మీరాజం (గొల్లపల్లి), సాన స్వామి (ఇస్రాజ్ పల్లె), కొలగాని రామయ్య (బీరంజ్ పల్లె) కార్యదర్శులుగా కొప్పుల స్వామి (గొల్లపల్లి), గొర్రు గంగయ్య (ఇస్రాజ్ పల్లె), కోశాధికారిగా ఉప్లెంగుల నందు (శంకర్రావు పేట) నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒరగంటి భార్గవ రామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతానికి పాటుపడతానని భార్గవ రామ్‌ దిశానిర్దేశం చేశారు.

పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించబోమని ప్రతిజ్ఞ

కథలాపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లలను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రైవేట్ పాఠశాలలకు పంపించబోమని పేర్కొంటూ కథలాపూర్ మండలంలోని చింత కుంట కు చెందిన గ్రామ స్థులు ఆదివారం ఏకగ్రీవంగా తీర్మానం చేసి ప్రతిజ్ఞ చేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలకే పిల్లలను పంపించి చదివిస్తామని మహిళలు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు కలిసి ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ పాఠశాలలోనే ఉచితంగా యూనిఫాం, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు అందుతున్నందున తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని చేశారు. ప్రైవేట్ బస్సులు వచ్చినా తిరిగి పంపించి వేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, మాజీ డీసీసీ సభ్యులు చెదలు సత్యనారాయణ, వేముల కృష్ణ, గ్రామస్థులు, మహిళలు ఉన్నారు.



చింతకుంటలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

తైక్వాండో కరాటే పోటీలలో కోరుట్ల విద్యార్థి ప్రతిభ

కోరుట్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మౌలాలి కేసర్ పట్టణంలోని నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ తైక్వాండో కరాటే చాంపియన్‌షిప్ 2025లో పట్టణానికి చెందిన యండి ఖాజా సుజానోద్దీన్ విద్యార్థి కాంస్యం పతకం సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. మార్చి నెలలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో ఖాజా సుజానోద్దీన్ బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరాలు అభినందనీయం

మెట్‌పల్లి రూరల్, జూన్1 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మాజీ ఎంపీటీసీ పుల్ల జగన్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని జగ్గాసాగర్ గ్రామంలో మెట్‌పల్లికి చెందిన ప్రైవేట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ శిబిరం లో చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ముల రాజపాల్‌రెడ్డి, బోల గంగాధర్, ఇల్లెందుల శ్రీనివాస్, గూడూరు తిరుపతి, గడ్డం శివారెడ్డి పాల్గొన్నారు.

పురోహితుల వేతనాలు పెంపు

ధర్మపురి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి చెందిన పురోహితుల వేతనాలు పెంచుతూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ద్వారా జారీ చేసిన ఉత్తర్వుల కాపీని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులతో కలిసి వారికి అందించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అలిశెట్టి పోహితులు బొజ్జ రాజగోపాల్, నంబి అరుణ్‌కుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.